నమస్తే తెలంగాణ
# నల్లగొండ
10 నల్లగొండ, ఆదివారం 8 జూన్ 2025 NALGONDA



**బక్రీద్ సంబురాలు:** చౌటుప్పల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# స్క్రాప్ వాహనాల దందా

## బీఎస్-3 వాహనాలు తక్కువ ధరకు కొనుగోలు

- కార్లకు ఇంజిన్, చాసిస్ నంబర్ల మార్పు
- స్క్రాప్ వాహనాలకు కొత్త రూపు
- నంబర్ మార్చి అధిక ధరలకు విక్రయాలు
- మిర్యాలగూడలో కొనసాగుతున్న అక్రమ దందా
- చోరీకి గురైన వాహన యజమాని ఫిర్యాదుతో బయటపడ్డ బాగోతం



మిర్యాలగూడలో మరో అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. గడువు తీరిన వాహనాలను స్క్రాప్ కింద తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటికి ప్రమాదానికి గురైన వాహనాల నంబర్లను అమర్చి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇటీవల ఓ కారు రిపేరుకు గురికావడంతో జీపీఎస్ ఆన్ అయింది. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది.

మిర్యాలగూడ, జూన్ 7: గడువు తీరిన వాహనాలు స్క్రాప్ కింద తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రమాదానికి గురైన వాహనాల నెంబర్లు వీటికి అమర్చి అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం మిర్యాలగూడలో వెలుగు చూసింది. హైదరాబాద్‌లో చోరీకి గురైన కారును మున్సిపాలిటీలో పని చేస్తున్న వ్యక్తి ఇటీవల ఆంధ్రాలో కొనుగోలు చేశాడు. ఈ కారును పట్టణంలోని కారు షెడ్డులో రిపేర్ చేయిస్తుండగా కారు జీపీఎస్ ఆన్ కావడంతో రెండేండ్ల క్రితం హైదరాబాద్‌లో కారు చోరీకి గురైందని యజమాని హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారు జీపీఎస్‌ను ఆధారం చేసుకుని మిర్యాలగూడకు వచ్చిన సదరు యజమాని విషయాన్ని పోలీసులకు తెలిపాడు. కారు ఇంజిన్ నెంబర్, చాసిస్ నెంబర్ మార్చి ఉన్నదని మెకానిక్ గుర్తించి చెప్పాడు. దీంతో కారు ఎక్కడ కొనుగోలు చేశారో, ఎవరు అమ్మారో చెప్పాలని పోలీసులు సదరు వ్యక్తిని ప్రశ్నించడంతో వివరాలు చెప్పినా కూడా అసలు వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్లు తెలిసింది. చోరీకి గురైన వాహనం కూపీ లాగడంతో నెంబర్ ఎవరు, ఎలా మార్చారనే విషయాన్ని విచారణ చేసే క్రమంలో పట్టణానికి చెందిన ఒక టింకరింగ్, డెంటింగ్ షాపు యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తాను ఈ కారు నెంబర్, చాసిస్ నెంబర్ మార్చలేదని, పట్టణంలోని ఒక పార్కింగ్ యార్డు యజమాని పంపించిన మూడు కార్లకు మాత్రం ఇంజిన్, చాసిస్ నెంబర్లు మార్చినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. చోరీకి గురైన వాహనం గురించి కూపీ లాగడంతో బీఎస్-3 వాహనాల గుట్టు బయటపడింది.

2019లో భారత ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువు తరువాత బీఎస్-3 కార్లు విక్రయించవద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో షోరూమ్‌ల యజమానులు చాసిస్ నెంబర్లు, ఇంజిన్ నెంబర్లు తొలగించి వాటిని స్క్రాప్ కింద విక్రయించినట్లు సమాచారం. ఈ కార్లను అతి తక్కువ ధరలకు స్క్రాప్ కింద కొనుగోలు చేసి, రోడ్డు ప్రమాదాల్లో ధ్వంసమైన కార్ల ఇంజిన్, చాసిస్ నెంబర్లను అమర్చి బీఎస్-3 వాహనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పట్టణంలోని ఓ పార్కింగ్ యార్డు యజమాని ఈ విధంగా మూడు వాహనాలకు మార్చినట్లు డెంటింగ్ షాపు యజమాని పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. సుమారు నాలుగేండ్ల క్రితం ఢిల్లీ, పాండిచ్చేరికి చెందిన సుమారు 20 వాహనాలను తెలంగాణకు తీసుకొచ్చి ఇదే రీతిలో విక్రయాలు జరిపిన ముఠా గుట్టును అప్పట్లో పోలీసులు ఛేదించారు.

ఈ అక్రమ దందాలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ప్రధానపాత్ర ఉండడంతో ఆ వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమికి చెందిన ఒక ముఖ్య నాయకుడి ద్వారా మిర్యాలగూడ పోలీసులకు ఫోన్ చేయించినట్లు, దీంతో ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఎస్-3 వాహనాల దందాలో ప్రధాన సూత్రధారి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉన్నాడని సమాచారం. కోట్లాది రూపాయల దందా కొనసాగిన ఈ అక్రమ వ్యవహారంలో పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేయిస్తేనే అసలు దోషులు బయటపడటంతోపాటు అక్రమాలు ఏమేరకు జరిగాయనే విషయాలు వెలుగులోకి వస్తాయి.

### సమగ్ర దర్యాప్తు చేస్తున్నాం: డీఎస్పీ రాజశేఖర్ రాజు

బీఎస్-3 వాహనాలకు ఇంజిన్, చాసిస్ నంబర్లు మార్చి విక్రయాలు జరుపుతున్న వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నాం. ఈ విషయంలో దోషులెంతటివారినైనా ఉపేక్షించేది లేదు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఈ విషయంలో నెంబర్లు మార్చిన వారు, వాహనాలు కొనుగోలు చేసిన వారు, వాహనాలు విక్రయించిన ప్రధాన సూత్రధారి ఎవరనేది త్వరలోనే తేల్చి, చర్యలు తీసుకుంటాం.



# మృగశిర మురిపెం

- ఆస్తమా రోగులకు దివ్యౌషధం
- చేపలకు పెరిగిన డిమాండ్

రామగిరి, జూన్ 7: చేపల పండుగగా నిర్వహించే మృగశిర కార్తె రానే వచ్చింది. ప్రతిఏటా జూన్‌లో వచ్చే ఈ పండుగ సందర్భంగా చేపలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. మృగశిర కార్తె చేపలు తినడమనేది ఆనాదిగా వస్తున్నది. రోహిణి కార్తెలో రోకళ్లు పగిలే ఎండల నుంచి చల్లటి వాతావరణంలోకి తీసుకెళ్లే శుభదినం కూడా నేటి నుంచి ప్రారంభంకానున్నది.

**చేపలకు భలే గిరాకీ...**

వాతావరణంలో మార్పుల వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతారు. పిల్లలు, వృద్ధులు ఉబ్బసం తదితర వ్యాధులతో ఇబ్బందులు పడతారు. రోగనిరోధక శక్తి కోసం చేపలు, నాటుకోళ్లను తింటారు. శాకాహారులు ఇంగువ, బెల్లం కలిపి ఉండలుగా చేసుకొని తింటే జీర్ణవ్యవస్థ మెరుగుపడి రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ఈ కార్తె రోజు చేపలు ఎక్కువకు విక్రయిస్తున్నారు.



**చేపల ధరలు ఇలా....**

| చేపరకం | సాధారణ రోజుల్లో | మృగశిరకార్తె రోజు |
|---|---|---|
| కొర్రమీను | రూ. 400 | 550 |
| బొచ్చెలు | రూ. 150 | 180 |
| బొచ్చెలు(లైవ్) | రూ. 180 | 220 |
| బురదమట్ట | రూ. 250 | 400 |
| రవ్వ | రూ. 160 | |

రామలింగేశ్వరుడి కల్యాణానికి

# కేటీఆర్ రాక

## ఉరుమడ్లలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

## కుంభాభిషేక పూర్ణాహుతిలో పాల్గొననున్న కేటీఆర్

చిట్యాల, జూన్ 7: మండలంలోని ఉరుమడ్లలో ఆదివారం జరగనున్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కుంభాభిషేక పూర్ణాహుతి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొంటారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తెలిపారు. రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామస్తులు శనివారం బొడ్రాయి అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బిందెడు నీళ్లతో బొడ్రాయికి అభిషేకం చేశారు.

**ఆలయ చరిత్ర..**

దాదాపు 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయాన్ని 2010లో కంచర్ల సోదరులు తమ తండ్రి కంచర్ల మల్లారెడ్డి జ్ఞాపకార్థం పునర్నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలను కంచర్ల సోదరులు క్రమం తప్పకుండా వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవాలయ పునర్నిర్మాణం జరిగి 15 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది బ్రహ్మోత్సవాలతోపాటు మహాకుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

### వైభవంగా నిర్వహిస్తున్నాం..

రామలింగేశ్వర ఆలయం ఎంతో ప్రాముఖ్యత, మహిమ కలిగిన ఆలయం. ఆలయాన్ని పునర్నిర్మాణం 15 ఏండ్లుగా ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాలు ప్రత్యేకమైనవి. మహాకుంభాభిషేకం నిర్వహించడంతోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలి.

\- కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



బొడ్రాయికి అభిషేకాలు చేస్తున్న మహిళలు

# చౌకబారు విమర్శలు సరికాదు



## చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 7: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని రాయగిరిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకే తిరిగి శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అంతేకానీ లేని పోని చౌకబారు విమర్శలు చేయడం సరికాదన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మహానాయకుడు కేసీఆర్ అని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అలాంటి గొప్ప నాయకుడిని విమర్శిస్తే కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు గౌరవం పెరగదని అన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, కేసీఆర్ లాంటి మహోన్నత వ్యక్తిని విమర్శిస్తే తెలంగాణ యావత్తు సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓటమి చెందుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి చెరిపేస్తే చెరిగిపోయేదికాదని ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కుతాడి సురేష్, నాయకులు దండబోయిన బాలరాజు, దోసపాటి హరీష్, పల్లపాటి రవికుమార్, గాజుల నవీన్, మోతే మనోహర్ తదితరులున్నారు.

# పిచ్చోడి చేతిలో రాయిలా రాష్ట్రం

- కాంగ్రెస్ అంటేనే ఖయ్యాల పార్టీ
- బీఆర్ఎస్‌ది పారదర్శక పాలన
- కేసీఆరే మళ్లీ సీఎం కావాలంటున్న ప్రజలు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, జూన్ 7: సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి ఒరగబెట్టింది ఏమీలేదని, కాంగ్రెస్ అంటేనే ఖయ్యాలకు కాలు దువ్వే పార్టీ అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం పట్టణకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేండ్లు పారదర్శకంగా ముందుకు నడిపిందని, కానీ ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. అందుకే తెలంగాణకు మళ్లీ సీఎంగా కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. కేవలం తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను తిట్టడానికే సీఎం రేవంత్ ఆలేరులో సభ పెట్టుకున్నారని విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ స్వాగతం పలికిందే తప్పా.. ఎక్కడా అడ్డుకోలేదని గుర్తు చేశారు. తెలంగాణ తీసుకొచ్చిన కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఎవరికీ లేదన్నారు. గతంలో రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకున్న కాంగ్రెస్.. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గంధమల్లకు మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ లేకుండా గంధమల్లకు నీళ్లు రావనేది కాంగ్రెస్ నాయకుల గ్రహించాలన్నారు. గతంలో యాదగిరి క్షేత్ర సన్నిధిలో మెడికల్ కళాశాలకు రూ.182 కోట్లు మంజూరు చేసి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. మళ్లీ చేసిన పనులకే శంకుస్థాపన చేయడం అనేది సిగ్గుచేటని విమర్శించారు. యాదాద్రిని యాదగిరి గుట్టగా మార్చడాన్ని ఎవరూ స్వాగతించలేదని, కేసీఆర్ పేరు యాదగిరి క్షేత్రంపై సువర్ణాక్షరాలతో చెక్కబడే ఉంటుందన్నారు. పదేండ్ల కేసీఆర్ సంపద సృష్టిస్తే కాంగ్రెస్ కొల్లగొడుతుందని విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా లేరని, అందుకే కాంగ్రెస్ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని చురకలు అంటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి, మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, దుబ్బాక శ్రీధర్, పక్కీర్ సత్తిరెడ్డి, జినుకల కార్తీక్ పాల్గొన్నారు.

# గంధమల్ల సృష్టికర్త కేసీఆరే..

## మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



యాదగిరిగుట్ట, జూన్ 7: గంధమల్ల జలాశయం సృష్టికర్త కేసీఆరేనని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ స్పష్టం చేశారు. ఒక పక్క కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందంటూనే గంధమల్లకు మల్లన్నసాగర్ కాళేశ్వరం జలాలు తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను గందరగోళ పరిస్థితులకు నెట్టివేస్తున్నారన్నారు. ఈమేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ మొదటగా 9.8 టీఎంసీల సామర్థ్యంలో నిర్మిస్తామని చెప్పగా.. తర్వాత గంధమల్ల రైతుల విజ్ఞప్తి మేరకు 1.41 టీఎంసీలకు కుదించి గంధమల్ల జలాశయాన్ని నిర్మించాలని భావించిన్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అహర్నిశలు కృషి చేసి ప్రాజెక్టులు పూర్తి చేస్తే.. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ప్రాజెక్టులన్నీ పూర్తి చేశామని గొప్పలు చెబుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిని పదవి నుంచి తొలిగించేందుకు మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారని, దీంతో అసహనానికి లోనై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మల్లన్నసాగర్, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లను ప్రజలు మర్చిపోరని గుర్తు చేశారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.

# రేవంత్‌కు సాగు జలాలపై అవగాహన లేదు

- గంధమల్ల రూపశిల్పి కేసీఆరే..
- శంకుస్థాపన చేసిన పనులకు తిరిగి శంకుస్థాపనలు
- రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తిట్టడానికే తిరుమలాపూర్ సభ
- అభివృద్ధి సభకాదు.. అబద్ధాల సభ



మాట్లాడుతున్న టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూన్ 7: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 15వ ప్యాకేజీ టెయిల్‌ఎండ్ భాగంగా నిర్మితమైన గంధమల్ల జలాశయ రూపశిల్పి కేసీఆరేనని, 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో స్వామివారి పేరిట యాదగిరిగుట్టకు వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం యాదగిరిగుట్ట బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడ్డాడు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఆలేరు నియోజకవర్గానికి సాగుజలాలు అందించాలన్న లక్ష్యంతోనే 2019 ఫిబ్రవరిలోనే 9.8 టీఎంసీ సామర్థ్యంతో ప్రతిపాదించారని అన్నారు. అనంతరం భూ సేకరణ సమస్య రావంతో 4.2 టీఎంసీకి కుదించడంతోపాటు గ్రామస్తుల కోరిక మేరకు రీడిజైన్ చేసి 1.41 టీఎంసీ కుందించి నిర్మాణ పనులు చేపట్టాలని పరిపాలన అనుమతులతోపాటు నిధులు కూడా మంజూరయ్యాయని స్పష్టం చేశారు. నిర్మాణ పనులు కాంట్రాక్టు అప్పగించారని తెలిపారు. కాంట్రాక్టు పనులు గుత్తా అమిత్‌రెడ్డి దుక్కించుకొని పనులు ప్రారంభిస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుపడి ప్రాజెక్టు పనులు జరుగకుండా చేశారన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని అబద్ధాలు చెప్పిన రేవంత్‌రెడ్డి గంధమల్లకు ఎలా నీళ్లు తీసుకువస్తారో చెప్పాలన్నారు. ఎల్లంపల్లి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుల నుంచి గంధమల్లకు సాగునీళ్లు తీసుకువస్తారని చెప్పిన రేవంత్‌రెడ్డి సాగు జలాలు మీద అవగాహనలేదన్నది స్పష్టమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మితమైన మల్లన్నసాగర్ నుంచే గంధమల్లకు జలాలు వస్తాయన్నారు.

**మళ్లీ శంకుస్థాపన చేయడానికి సిగ్గుండాలే..**

ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు చేసిన పనులను తిరిగి శంకుస్థాపనలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. కొలనుపాక, కాల్వపల్లి హై లేవల్ బ్రిడ్జి నిర్మాణపు పనులకు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శంకుస్థాపన చేశారన్నారు. ఆలేరుకు రూ.1051.45 కోట్ల పనులను తీసుకువచ్చామని ఎమ్మెల్యే అయిలయ్య ప్రచార ఆర్భాటమేనని గుర్తుచేశారు. ఇందులో కేవలం రూ.200 కోట్ల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మిన హా మిగతా పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసివేసనని అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానాన్ని కేసీఆర్ రూ.1300 కోట్లతో పునర్నించారని గుర్తు చేశారు. స్వామివారి విమా న గోపురం స్వర్ణతాపడం పనులు గత ప్రభుత్వమే చేపట్టడంతో పాటు సుమారు 100 కిలోల బంగారాన్ని సమకూర్చారని స్పష్టం చేశారు.

### అబద్ధాల సభ : కల్లూరి రామచంద్రారెడ్డి

తుర్కపల్లి మండలంలోని తిరుమలాపూర్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభ అభివృద్ధి సభ కాదని, అబద్ధాల సభ అని అన్నారు. ఆయన మాట్లాడిన ప్రతి మాట అబద్ధమేనని అన్నారు. సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి త్వరలో ప్రజలె బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ, నాయకులు మిట్ట వెంకటయ్య, కసావు శ్రీనివాస్, మాటురి బాలరాజు, గుండపల్లి వెంకటేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, పేరబోయిన సత్యనారాయణ, కొన్యాల నర్సింహారెడ్డి, వాసం రమేశ్, సతీశ్ భట్, వీరేశం, గడ్డం చంద్రం తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ తిట్టడానికి నోరెలావచ్చింది..

రాష్ట్ర సాధకుడు కేసీఆర్ తిట్టడానికి నోరేలావస్తుందని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మండిపడ్డారు. 18 నెలల కాలంలో ఆయన ఏ సభ పెట్టినా కేసీఆర్ తిట్టడానికే పెట్టాడు తప్ప, అభివృద్ధిపై సోయి లేదన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తిట్టడానికే ఆయన సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. సభలో కేసీఆర్ తిడుతుంటే మహిళలే ఛీ అంటూ సభ నుంచి లేచివెళ్లిపోయారని తెలిపారు.

### వైద్య కళాశాల తెచ్చింది కేసీఆరే..

యాదగిరిగుట్టకు స్వామివారిపేరిట వైద్య కళాశాలను తీసువచ్చిందే మాజీ సీఎం కేసీఆర్ అని మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ 2022 జూలై 6న జీవో నంబర్ 85 ను విడుదల చేస్తూ వైద్య కళాశాల భవన నిర్మాణానికి రూ. 183 కోట్ల నిధులను సైతం మంజూరు చేశారని గుర్తు చేశారు. యాదగిరిగుట్టలో ఉన్న పీహెచ్‌సీని మొదటగా బీఆర్ఎస్ ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. ఈ మేరకు 2022 నవంబర్ 29న జీవోనంబర్ 772ను విడుదల చేసిందని, నిర్మాణ పనుల కోసం నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. వంద పడకల ఏరియా ఆస్పత్రి కోసం అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన కూడా చేశారని, దీని స్థానంలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి మెడికల్ కాలేజీకి నామకరణం చేసి, మొదట వంద పడకల ఆస్పత్రి కోసం శంకుస్థాపన చేసి స్థలంలో కాకుండా మరో చోట నిర్మించాలని భావించిందన్నారు. భవన నిర్మాణం, క్యాంపస్ కోసం 200 ఎకరాల భూమి అవసరం పడుతుందని భావించి మల్లాపూర్‌లో సర్వే నంబర్ 64లో సుమారు 200 ఎకరాల విశాలమైన స్థలంలో నిర్మించాలని ప్రతిపాదించిందన్నారు. కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మేమే తీసువచ్చామని చెప్పడం ఎవరికో పుట్టిన పిల్లను మాకే పట్టిందని చెప్పిన్నట్లుగా ఉందన్నారు. యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. అనేక సార్లు నాటి సీఎం కేసీఆర్, అప్పటి మంత్రి హరీష్ రావును స్వయంగా కలిసి విజ్ఞప్తులు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన వైద్య కశాళాలను ఎక్కడ నిర్మించాలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే వైద్యకళాశాల భువనగిరికి తరలివెళ్లిందన్నారు. యాదగిరిగుట్టలో అనువైన ప్రదేశం ఉన్నా భువనగిరి తరలించడంలో ఆంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు.